క్లుప్తంగా

మామిడి యాజమాన్య పద్ధతులపై శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న మధుసూదన్ రెడ్డి

రామకుప్పం: మామిడి కోతల అనంతరం చేయాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడి కాయలు కోసిన వెంటనే కొమ్మలు కత్తిరింపులు చేయాలన్నారు. కొమ్మలు కత్తిరింపుల ఆవశ్యకతపై కలిగే ప్రయోజనాలను వివరించారు. సెప్టెంబర్, అక్టోబర్ 10వ తేదీలోపు పూత వచ్చినప్పుడు దున్నుకోవడం వలన మామిడి చెట్లకు సూక్ష్మపోషకాలు అంది పూత బాగా వచ్చి దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. అక్టోబర్ తర్వాత దున్నడం వలన మామిడి చెట్లు గర్భ దశలో ఉండడం వల్ల పంట దిగుబడి కష్టమన్నారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన ప్రశ్నలకు ఉద్యానశాఖ అధికారులు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మునుస్వామి, ఉద్యానశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ దేవదాస్

రొంపిచెర్ల: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యసేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంలో పేదలకు వైద్యపరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ కంటి చూపుపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి 27 మందికి కంటి చూపు లోపాలను గుర్తించామని అన్నారు. 89 మందికి వైద్య పరీక్షలు చేశామని, వీరిలో ఇద్దరికి కుష్టు వ్యాధి సోకినట్లు నిర్ధారణ చేశామని పేర్కొన్నారు. వీరికి ఇంటి వద్దే మందులను ప్రతినెలా ఇస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం దేవదాస్, ఆప్తమాలజిస్ట్ పెంచలయ్య, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

సామూహిక భోజనాలు



సామూహిక భోజనాలలో విద్యార్థులు, టీచర్లు

పలమనేరు: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు సామూహిక భోజనాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ లీలారాణి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా వంద రోజులపాటు తిథి భోజనాలను దాతల సాయంతో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. పూర్వవిద్యార్థులు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు సైతం కార్యక్రమంలో పాలుపంచుకోవచ్చని ఆమె తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

దారి లేకుండా కంచె

–పలు కుటుంబాలకు తప్పని తిప్పలు



ఇళ్లకు దారి లేకుండా వేసిన కంచె

పలమనేరు: మూడు దశాబ్దాలుగా ఉన్న దారిని మూసేయడంతో తమ కుటుంబాలకు ఇబ్బందిగా మారిందని పట్టణంలోని ఎంసీఆర్ నగర్‌కు చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మున్సిపాలిటీలోని ఎంసీఆర్ నగర్‌లో పలు కుటుంబాలు నివాసముంటున్నాయి. ఎన్నో ఏళ్లుగా వీరు అక్కడి దారిని వాడుకుంటున్నారు. ఇదే దారిలో మున్సిపల్ నీళ్ల కొళాయిల పైప్‌లైన్లు ఉన్నాయి. ఇటీవల అక్కడ స్థలాన్ని కొనుగోలు చేసిన ఓ మహిళ ఇళ్లకు వెళ్లే దారికి అడ్డంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. దీంతో బాధితులు దారిని మూసేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఇప్పటికే అధికారులను కోరినట్టు మునెప్ప, ఆదిలక్ష్మి, సుబ్బమ్మ, మారప్ప తెలిపారు.

సచివాలయాల సిబ్బందితో పింఛన్లు

పలమనేరు: ఆగస్టు 1న సామాజిక పింఛన్లను సంబంధిత సచివాలయాల సెక్రటరీల ద్వారా పంపిణీ చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తారని లబ్ధిదారులు ఎవరూ కార్యాలయాల వద్దకు రావొద్దని సూచించారు.

కమ్మనైన బైరొడ్ల ఎర్రన్నం

- నాటి తరాన్ని మెప్పిస్తూ..నేటి తరానికి రుచి చూపిస్తూ..
- పలమనేరు ప్రాంతంలో మళ్లీ బైరొడ్ల సాగు
- ఆసక్తి చూపుతున్న యువ రైతులు
- చీడపీడల భయం అక్కర్లేదు
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు

పలమనేరు: ప్రస్తుతం ఉన్న హైబ్రీడ్ వరివంగడాలు అందుబాటులో లేనపుడు పలమనేరు ప్రాంతంలో సాగయ్యే రకం బైరొడ్లు. ఈపేరు నేటి తరానికి తెలియకపోవచ్చు. ప్రస్తుతం మన ఇళ్లలోని తాత, అవ్వలకు మాత్రం బైరొడ్ల గురించి బాగా తెలుసు. అసలు బైరొడ్లు పేరు చెబితే పాతకాలం నాటి రైతులు అబ్బా ఎంత కమ్మగా ఉంటాయోనని చెబుతారు. ప్రస్తుతం మనం తింటున్న పాలిష్ బియ్యంలో ఎటువంటి సత్తాలేకపోవడంతో మనిషికి తగిన శక్తిలేకుండా పోతోంది. అయితే అద్భుతమైన ప్రొటీన్‌లు గల బైరొడ్ల సాగుపై రైతులు ఇప్పుడిప్పుడే మక్కువ పెంచుకోవడం విశేషం.

చెరువు ఆయకట్టు, వాగుల పక్కన సాగుచేస్తున్న వైనం..

గతంలో బైరొడ్లు, కొర్రలు, సామలు, రాగులు వర్షాధారంతో పండేవి. ముఖ్యంగా బైరొడ్లను చెరువుల కింద, వాగుల పక్కన, నీరు ఎక్కువగా ఉండే మడుల్లో ధాన్యపు విత్తనాలను చల్లేవారు. వర్షాలకు తట్టుకుని ఎటువంటి చీడపీడలకు తావులేకుండా నాలుగు నెలల్లో పంట చేతికొచ్చేది. కాలక్రమేణా సన్న బియ్యానికి అలవాటు పడిన రైతులు బైరొడ్ల సాగును మరిచారు. పదేళ్ల క్రితం వంద ఎకరాల్లో కేవలం రబీలో మాత్రం బైరొడ్లు ఈ ప్రాంతంలో సాగయ్యేవి. కాలక్రమంలో వీటి సాగు లేకుండాపోయింది. కరోనా తర్వాత మారిన వ్యవసాయ పరిస్థితుల కారణంగా పలువురు యువకులు, సాఫ్ట్‌వేర్లు సైతం సేద్యం వైపు ఆసక్తి చూపారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ విధానాలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. దీంతో చదువుకున్న వారు వ్యవసాయం చేస్తూ పాత విధానాలను మళ్లీ అవలంబిస్తున్నారు. ఆమేరకు నాటి కమ్మదనాన్ని నేటి తరానికి రుచి చూపించాలనే తలంపుతో మండలంలోని కూర్మాయి గ్రామానికి చెందిన యువరైతు చందూల్ రెడ్డి ఇప్పటికే పలు రకాల పాత రకాల వరి విత్తనాలను సాగు చేసి విత్తనాలను సైతం ఆసక్తి గల రైతులకు అందుబాటులో ఉంచాడు.

మొరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి అనే రైతు తన రెండెకరాల్లో పొలంలో గతంలో బైరొడ్లను సాగుచేసి మంచి పంట దిగుబడిని సాధించాడు. కొలమాసనపల్లికి చెందిన మహిళా రైతు రత్నక్క విత్తనాలను అడిగిన వారికిస్తూ బైరొడ్లను సాగు చేసేలా అవగాహన కల్పిస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో పదెకరాల్లో సాగుకు కొందరు రైతులు సిద్ధమయ్యారు.



పలమనేరు మండలంలో సాగవుతున్న బైరొడ్ల పంట (ఫైల్)

ఇవి కమ్మనైన ఎరుపు బియ్యం..

మామూలుగా బియ్యం తెలుపు రంగులో ఉంటుంది. కానీ బైరొడ్లు మాత్రం ఎరుపు రంగులో పెద్దపెద్దగా ఉంటాయి. నాటి రోజుల్లో కమ్మనైన వట్టి అన్నాన్నే తినేసేవారట. ఈ పంట సాగుకు పెద్దగా క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. దీంతో పంట పూర్తిగా ఆరోగ్యవంతంగా ఉంటుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. అందుకే ఓ పూట ఈ అన్నాన్ని తింటే అంత త్వరగా ఆకలికాదు. మంచి పోష్టిక విలువలు కలిగిన ఈ పంటను ఈ ప్రాంతంలో సాగు చేయడంతో మళ్లీ బైరొడ్లు నేటి తరానికి పరిచయం కాబోతున్నాయి.

పాత వంటలకు బైరొడ్ల బియ్యమే కాంబినేషన్..

ప్రస్తుతం కొన్ని హోటళ్లలో మాత్రం బైరొడ్ల బియ్యంతో అన్నం, రాగిముద్దలను తయారుచేస్తున్నారు. వీటితో పాతకాలం నాటి వంటకాల రుచి చూసే అవకాశం దొరికినట్టే. బైరొడ్లు అన్నంలోకి ఎర్రనూగుల చట్ని, వేరుశనగ కాయల ఊరిమిండి, ఎర్రకారం, ఉలవచారు, నాటుకోడి, చేపల పులుసు మంచి కాంబినేషన్. వీటితో బెల్లం పరమాన్నం సూపర్‌గా ఉంటుంది. ముఖ్యంగా మధుమేహంతో బాధపడేవారు బైరొడ్ల బియ్యంతో రాగిసంగటి తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. నేటి ఫాస్ట్‌ఫుడ్ కల్చర్‌తో ఆరోగ్య ఇబ్బందులు, ముఖ్యంగా ఊబకాయ సమస్యలు తప్పడం లేదు. విపరీతమైన రసాయనాల కారణంగా నేటి సమాజం కొత్త రుగ్మతల బారిన పడుతోంది. ఇలాంటి వాటికి బదులు పాతకాలం నాటి రుచుల పట్ల జనం మక్కువచూపుతుండడం విశేషం. దీంతో బైరొడ్ల సాగుకు అవకాశం దొరికింది.



బైరొడ్లు బియ్యం, బైరొడ్ల ఎర్ర అన్నం

బైరొడ్లు పంట సాగు చేశా..



మా ఇంట్లో పెద్దలు అన్నం తినేటప్పుడల్లా మాకాలంలో బైరొడ్లు అన్నం తినేవాళ్లం అందుకే మేము ఇంత దృఢంగా ఉన్నామని చెప్పేవారు. మేము కూడా చిన్నప్పుడు తిన్నోళ్లమే. మళ్లీ ఎన్నో రకాల హైబ్రిడ్ వంగడాలు వచ్చేశాయి. అందుకే ఆరోగ్యం కోసం పొలంలో బైరొడ్లను సాగుచేశా. బైరొడ్లు అన్నం తింటా ఉంటే కమ్మగా ఉంటుంది.

రామచంద్రారెడ్డి, రైతు, మొరం

పాతకాలం వరి వంగడాలను కాపాడాలనే....



ఇప్పటికే తాతముత్తాల కాలం నాటి పది రకాల వరి వంగడాలను సాగుచేశా. ఆ విత్తనాలను సైతం భద్రంగా ఉంచి ఆసక్తిగల రైతులకు అందుబాటులో ఉంచా. బైరొడ్ల సాగు దశాబ్దాల తర్వాత ఈ ప్రాంతంలో సాగు మొదలైంది. ఈరకం ఎటువంటి చీడపీడలకైనా తట్టుకుంటుంది. దీనికి పెద్దగా ఖర్చులేదు. నీరు లేకున్నా, నీరు ఎక్కువైనా నష్టం ఉండదు. పైగా మంచి దిగుబడులు వస్తాయి. ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు.

చందూల్ రెడ్డి, ప్రకృతి రైతు, కూర్మాయి, పలమనేరు మండలం

సారూ...మేమూ బాధితులమే!

- ఆపరేటర్, సీఓ మాటనమ్మి డాయ్ యాప్‌లో చేరాం
- మీడియాతో ఆర్పీలు



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్పీలు

పలమనేరు: సారూ..మేమూ నమ్మి మోసపోయి డబ్బులు పోగొట్టుకున్న బాధితులమే.. ప్రతిఒక్కరూ ఆర్పీలను ఆడిపోసుకుంటున్నారు, దీనికంతటికీ కారణం మెప్మాలోని కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్, సీఓలే కారణమని పలమనేరు మున్సిపాలిటీకి చెందిన పలువురు ఆర్పీలు (రిసోర్స్‌పర్సన్స్) మంగళవారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము నిత్యం మెప్మా ఆఫీస్‌కు వస్తుంటామన్నారు. గ్రూపులకు సంబంధించిన సమాచారం ఆపరేటర్‌కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

దీంతో ఆపరేటర్, సీఓలు చెప్పిన మాటలను నమ్మి రూ.300 కట్టి మాఫోన్లకు యాప్ లింకులు డౌన్‌లోడ్ చేయించింది వాళ్లేనని తెలిపారు. మా వివరాలు, బ్యాంకు వివరాలు తెలిపి అందులో మాకు తోచినంత డబ్బులు వేశామన్నారు. కొన్నాళ్లు మా ఖాతాల్లోకి డబ్బులు వచ్చాయన్నారు. దీంతో తామంతా మరో పదిమందికి చేర్చాలని చెప్పడంతో తమ గ్రూపుల్లోని వారిని ఇందులో చేర్చామని, మళ్లీ వాళ్లు ఒక్కొక్కరు పదిమందిని చేరుస్తూ ఇలా ఈ సంఖ్య భారీగా వెళ్లిందన్నారు. తీరా మొబైల్‌లో డాయ్ యాప్ కనిపించకుండా పోవడంతో బాధితులు తమపై చెప్పడంతో అసలు విషయం బయటపెట్టాలనే తాము మీడియా ముందుకు రావాల్సి వచ్చిందన్నారు. ఎక్కువగా మోసపోయింది తామేనని తెలిపారు.

ఫిర్యాదులు సరే..పరిష్కారమేదీ?

- పరిష్కార వేదికలో కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు
- పరిష్కారం కోసం బాధితుల ఎదురుచూపులు

కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారానికి స్థానిక అధికారులు చర్యలు చేపట్టారు. దీంట్లో భాగంగా ప్రతి వారం సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. కానీ వాటి పరిష్కారం మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..పేరుకు మాత్రం జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికార యంత్రాంగంతో కలసి ఫిర్యాదుల స్వీకరణ సాగుతుంది..అనంతరం ఫిర్యాదులకు సంబంధించి శాఖల విభజన అనంతరం వాటి పట్టించుకోవడం లేదని విమర్శలు వెలువెత్తున్నాయి..

2,863 ఫిర్యాదుల స్వీకరణ..

ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టిన అనంతరం చిత్తూరు జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల వ్యవధిలో ఇప్పటికి రెండు మార్లు ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. దీంతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనలో బాధితులు సీఎంకు ఫిర్యాదులు అందజేశారు. అంతేకాకుండా గతవారం సీఎం సతీమణి భువనేశ్వరి కుప్పం పర్యటనలో ఫిర్యాదులు తీసుకున్నారు. గత సోమవారం కడా ప్రాజెక్టు డైరెక్టర్ ఫిర్యాదు స్వీకరణ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా నియోజకవర్గ పరిధిలో 2,863 ఫిర్యాదు స్వీకరించారు. వీటి పరిష్కారం అంతంతమాత్రంగానే ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. సీఎం పర్యటనలో 997, సీఎం భార్య పర్యటనలో 927, మొదటిసారి జిల్లా కలెక్టర్ పరిష్కార వేదికలో 650, రెండవ సారి 247, కడా పీడీ నిర్వహించిన ఫిర్యాదుల స్వీకరణలో 42 వినతులు అధికారులకు అందాయి. కానీ పరిష్కారం మాత్రం కాలేదని బాధితులు అంటున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ (ఫైల్)

మురుగేష్, గుడుపల్లె మండలం గుత్తార్లపల్లికి చెందిన వ్యక్తి. పదేళ్ల క్రితం కుప్పం రైల్వేస్టేషన్ నుంచి ద్రవిడ వర్సిటీ మీదుగా కేజీఎఫ్ వరకు రైల్వేలేన్ మంజూరు చేశారు. మురుగేష్‌కు చెందిన 50 సెంట్ల వ్యవసాయ భూమిని రైల్వేలేన్ల కోసం తీసుకున్నారు. దీనికి సంబంధించి నష్టపరిహారం ఇవ్వలేదు. నష్టపరిహారం కోసం రెండుసార్లు కుప్పం ఆర్డీఓ, సీఎం పర్యటనలో, జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజావేదికలో మురుగేష్ ఫిర్యాదు చేశారు. నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది వద్దకు వెళితే ఆర్డీఓ కార్యాలయంపైన , ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై నెట్టేస్తూ మాటలు దాటేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

బైరెడ్డిపల్లె: మండలంలోని లక్కనపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు జరుగుతున్నట్లు సర్పంచ్ క్రిష్ణారెడ్డి, సచివాలయ కార్యదర్శి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నిర్ణయించిన ప్రదేశంలోనే వేయాలని కోరారు.



లక్కనపల్లెలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

రైతులతో బంతాట

బంతి పూల ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్లు, బావుల్లో కొద్దో గొప్పో ఉన్న నీటితో శ్రమకోర్చి పూల సాగు చేస్తే తీరా ధరలు పతనం కావడం రైతులకు శాపంగా మారింది. గతంలో బంతి పూల ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఎక్కువగా బంతి పూల సాగు వైపు మొగ్గు చూపారు. ఇప్పుడు ధరలు పతనం కావడంతో మార్కెట్‌లో రేటు లేక, వాటిని రోడ్ల పక్క పారబోయే పరిస్థితి తలెత్తుతోందని ఆందోళన చెందుతున్నారు.

- పతనమైన బంతి పూల ధరలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

వి.కోట: మండలంలో దాదాపు 220 మంది రైతులు 180 ఎకరాల్లో బంతి పూల తోటలను సాగు చేశారు. సాధారణంగా బంతి పూల ధరలు రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలికితేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం కేజీ బంతి పూలు మొదటి రకం రూ.20 నుంచి రూ.30 వరకు, రెండవ రకం పూలు 10 నుంచి 20 రూపాయల వరకు పలుకుతుండడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. కోసిన కూలి కూడా రావడం లేదని వారు వాపోతున్నారు. ఎకరా బంతి పూల తోటను సాగు చేయడానికి రూ.30 వేల నుంచి రూ 50 వేల వరకు వ్యయం అవుతోంది. అయితే ధరలు పడిపోయిన కారణంగా ఎకరాకు 10,000 కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.



మాదకుప్పం వద్ద బంతిపూల తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి



మార్కెట్‌లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న బంతిపూల మూటలు

ధరల పతనానికి కారణమేమిటంటే..?

బంతి పూలను ఎక్కువగా పండుగలు, శుభకార్యాల్లో అలంకరణకు ఉపయోగించడం పరిపాటి. గత మూడు నెలలుగా మంచి ముహూర్తాలు, శుభాకార్యాలు లేకపోవడంతో బంతి పూల ధరలు పతనమయ్యాయని వ్యాపార వర్గాలు చెబుతున్న మాట. దీనిపై అవగాహన లేని రైతులు అధికంగా పూల పంటలను సాగు చేయడం మరో కారణం. అలాగే వాతావరణ పరిస్థితుల బట్టి పూలతోటలు ఏ నెలల్లో సాగు చేస్తే ఆదాయం వస్తుందో, అనుకూలంగా ఉంటుందో ఉద్యానవనశాఖ అధికారులు పూల రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

ఎగుమతులకు సరైన ప్రదేశం

తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో వి.కోట మండలం ఉండడంతో ఇక్కడి పూల ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి అనుకూలంగా ఈ ప్రాంతం ఉంటోంది. ఇక్కడి మార్కెట్‌లో భారీగా క్రయవిక్రయాలు సైతం జరుగుతుంటాయి. ఇక్కడి నుంచి బంతి పూలు రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, నెల్లూరు, చెన్నై, మహారాష్ట్ర, నాగ్‌పూర్ నగరాలకు సరాసరి రోజుకు 20 నుంచి 35 టన్నుల పూలను ఇక్కడి మార్కెట్ నుంచి ఎగుమతి చేస్తుంటారు.

గిట్టుబాటు ధరల్లేవ్!



నేను ఎకరా పొలంలో బంతి పూల సాగు చేశా. రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఈసారి ఖర్చు అయ్యింది. మొదటి కోతగా 12 మూటల పూలను మార్కెట్‌లోకి తెచ్చాను. పూలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో దిక్కుతోచడం లేదు. కేజీ పూల ధర రూ.50లపైన అమ్మితే గానీ నాకు గిట్టుబాటు కాదు.

–బాబురెడ్డి, తొరడి, బైరెడ్డిపల్లె మండలం

సీజన్ కాదంటున్నారు



మేము ఏ పంట సాగు చేసినా వి.కోట మార్కెట్‌కే తెస్తాం. ప్రస్తుతం రెండు ఎకరాల్లో బంతి పూలను సాగు చేశాం. గిట్టుబాటు ధర లేకపోవడం బాధగా ఉంది. కోసిన కూలీలు, ఆటో బాడుగులు కూడా రావు. వ్యాపారస్తులను ధరలు గురించి అడిగితే సీజన్ కాదంటున్నారు. పూల ధరలు పతనం కావడం తోటల్లోనే వదిలేసే పరిస్థితి వస్తోంది.

–విజయ్‌కుమార్, నల్లపు రెడ్డూరు, శాంతిపురం మండలం

రైతులు అవగాహనతో ముందుకెళ్లాలి



రైతులు పంటలను సాగు చేసేటప్పుడు సంబంధిత అధికారుల సలహాలు తీసుకోవాలి. సాధారణంగా ఆషాఢ మాసంలో బంతి పూల ధరలు తగ్గుముఖం పట్టాయి. వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శనివారం వంటి పండుగలు వస్తాయి. దీంతో ధరలు కొంత పెరిగే అవకాశం ఉంది. బంతిపూల సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.16,600 వరకు రాయితీ కల్పిస్తున్నాం.

లక్ష్మీప్రసన్న, ఉద్యానశాఖాధికారి, వి.కోట

మురుగన్‌కు హరోహర



ప్రత్యేకాలంకారంలో వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



ఆకువారిపల్లిలో సుబ్రహ్మణ్యస్వామి



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సదుం: మండల కేంద్రంలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. కృత్తిక సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు తలనీలాలు, పుష్ప కావళ్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీని పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులు క్రమబద్ధీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కమనీయంగా సాగింది.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా నాగిరెడ్డిపల్లి పంచాయతీ మునీశ్వరస్వామి కొండపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం గొదమాకులపల్లి, కడపల్లి గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అన్నసమారాధన చేశారు. కావళ్లతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కావళ్లు

వి.కోట: మంగళవారం ఆడికృత్తికను పురష్కరించుకుని మండలంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో కావళ్ల చెల్లింపులు వైభవంగా జరిగాయి. దాసార్లపల్లి సమీపంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే నాయకనేరి వద్ద గల బీసీ పల్లి పంచాయతీ సీవీఆర్ కొండపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, ఆకువారిపల్లి క్రాస్ వద్ద గల వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కావళ్లతో వచ్చిన భక్తులు ఆలయాల్లో మురుగన్‌కు హరోహర అంటూ స్వామి వారిని దర్శించుకున్నారు.

ముగిసిన ఆడికృత్తిక ఉత్సవాలు

గుడుపల్లె: గుడివంక శ్రీ వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వారం రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజున భక్తులు కావళ్లు చెల్లించుకుని మంగళ హారతులతో ముగించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేసి ప్రత్యేక పూజాకార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గొల్లపల్లెకు ఉత్సవ ఊరేగింపుగా తీసుకెళ్లారు.

హుండీ ఆదాయం రూ.45 వేలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవం పురస్కరించుకుని ఒక రోజు హుండీ ఆదాయం రూ.45 వేలు వచ్చినట్లు ఆలయ ఈఓ కమలాకర్ తెలిపారు. మంగళవారం భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.45,118 నగదు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ ఖాతాలో నగదును జమ చేయనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

పశువులకు టీకాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): లంపీ స్కిన్ వ్యాధి విషయంలో జాగ్రత్తలు పాటించి పాడి పశువులను కాపాడుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయకులు సురేష్ అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీలోని మిట్టూరు, దొడ్డి అనంతాపురం, పోతురాజుపల్లెలో మంగళవారం లంపీ స్కిన్ నివారణ టీకాలు వేశారు. మొత్తం 250 దూడలు, ఆవులకు వ్యాక్సిన్లు వేసి పాడి రైతులకు లంపీ స్కిన్ వ్యాధిపై అవగాహన కల్పించారు.